
# ప్రేమ విషాదం

☆

రచన : శ్రీ ఎమ్. వి. జె. భువనేశ్వరరావు



(రచయిత)

సాయంత్రం నాలుగు గంటలు కావస్తోంది.

బీచ్‌లో అంతా కోలాహలంగా....ఎన్నడూ లేనంతగా వస్తున్న జన సందోహంతో....ఎన్నో ప్రేమ జంటలతో కిటకిట లాడుతోంది.

సూర్యుడు క్రమంగా తన వెలుతురును తగ్గించుకుంటూ మబ్బుల మాటున యిరుక్కు పోతున్నాడు.

ఇవేం పట్టనట్లుగా ఆ సముద్రపు కెరటాలు తమ స్వంత శబ్దములతో....పిల్లలను మైమరపించే హోరులతో....ప్రేమికులకు తన్మయత్వం కలిగించే ధ్వనులతో, సముద్రపు తీరాన్ని తాకుతున్నాయ్....

ఉదయం పది గంటల నుంచీ, కాలేజీకి వెళ్ళకుండా ... ఈ చల్లని గాలుల మధ్య....సముద్రపు ఘర్జనల మధ్య.... ఆకలి దప్పికలు లేకుండా....మిట్ట మధ్యాహ్నపు సూర్యుడి ఎండ వేడిమిని కూడా లెక్క చేయకుండా....ఇంత మంది ప్రజల విషయాలు తమకేం పట్టనట్లుగా కాలక్షేపం చేసేస్తున్నారు....పద్మ మరియు హేమంత్.

"పద్మా! మన ప్రేమ శాశ్వతమనీ....మన ప్రణయం దృఢమనీ....మన పరిణయం ఖచ్చితమనీ... నా తోడు నీకు అవసరమనీ....ఒక్కసారి ఈ చేతిలో చెయ్యి వేసి చెప్పు...." అడిగాడు హేమంత్.

పద్మ అతని చేతిలో చెయ్యి వేసి, "హేమంత్....ఎట్టి పరిస్థితులలోనైనా ...ఎన్ని అవాంతరాలు ఎదురైనా.... ఎన్ని అడ్డు తెరలు పడినా .. నీకు తప్ప యింకెవ్వరికీ నా హృదయంలో చోటు లేదు." ప్రమాణం చేసింది.

"పద్మా! ఎన్ని యుగాలు గడిచినా, ఎన్ని కష్టాలు ఎదురైనా, నీ చల్లని ఒడిలో....ఈ సాగర తీరాన ఎంత ఆనందంగా ఉందో తెలుసా?....ఏనాటికైనా నువ్వు నా దానివే! నీవు లేనిదే ఈ జీవితమే లేదు....నేను బ్రతుకుతున్నదే నీ కోసం...." హేమంత్ కూడా ఆమె చేతిలో చెయ్యి వేసి ప్రమాణం చేశాడు.

ఉదయం కాలేజీకి వెళ్ళకుండా సరాసరి బీచ్‌కి వచ్చి.... సంభాషించుకుంటున్న వాళ్ళిద్దరి మాటల భావార్థ మిది. పద్మ ఒడిలో తలనాన్చి పడుకున్న హేమంత్ ఏదో గుర్తు కొచ్చిన వాడిలా లేచి కూర్చొని, "పద్మా! రేపటికి మనం కలిసి రెండు సంవత్సరములు కావస్తోంది....పెళ్ళి కాకుండా ఎన్నాళ్ళు మన మిలా గడుపుదాం?... అందుకే - మనం త్వరగా పెళ్ళి చేసేసుకోవాలి. అప్పుడే మనం కంటున్న కలలు పండి తీరుతాయి. ఈ సంవత్సరంతో మనది బియ్యేస్సీ ఎలాగూ కంప్లీట్ అవుతుంది. కాబట్టి నువ్వు మీ ఫాదర్‌ని మన పెళ్ళి గురించి అడుగు....నేను కూడా ఈ రోజే అడుగుతా!" అన్నాడు.

"హేమంత్! నాకు మాత్రం పెళ్ళికాకుండా యిలా తిరగటం బాగుందనుకొంటున్నావా?....ఇలా రోజూ మనం కాలేజీ మాని బీచ్‌కి రావటం ఏం బాలేదు. మన పెళ్ళి ఎంత తొందరగా అవుతుందాయని ఆశ పడుతున్నాను....

అందుకే ఈ రోజు తప్పకుండా, మా డాడీని, మమ్మీని అడిగి, ఒప్పించి తీరుతాను....'' అంది పద్మ, కొద్దిగా సిగ్గుగా, బుంగమూతి పెడ్తూ ఉత్సాహంగా.

''థాంక్స్, పద్మా! రేపిదే సమయానికి మనం ఎంతో ఆనందంగా గడపాలి....పద, పోదాం!'' అని లేచి నించున్నాడు హేమంత్.

''ఓకే ... హేమంత్!'' అంటూ పద్మ, హేమంత్ లిద్దరూ తీయని కబుర్లు చెప్పుకుంటూ, యింటికి బయలు దేరారు.

* * *

లాయర్ రామనాధం కొడుకు హేమంత్....చక్కని చూడ ముచ్చటైన ముఖం....ఆ బుగ్గమీది నల్లటి పుట్టు మచ్చ, గుబురు మీసాలతో ఉండే హేమంత్‌ని చూడగానే ఎంత చక్కని చుక్కైనా తన చిరి చక్కిలిగిలితో....కౌగిట్లోకి ఆహ్వానిస్తుంది.

అలాంటప్పుడు పద్మ లాంటి యువతి, హేమంత్‌ని కోరుకోవటంలో తప్పు లేదు. కారణం హేమంత్‌కి కావల్సిన చదువుంది. సుందరమైన రూపం వుంది. తగిన ఐశ్వర్యం వుంది. తగని హోదా వుంది. మరింక దేనికి లోటు?....

అలాంటి హేమంత్ మంచి గుణగణాలువున్న బుద్ధిమంతుడు కావటం దానికి మరో ఎగస్ట్రా క్వాలిఫికేషన్.

పద్మ ఒక ఆడదానిగా తనకు నచ్చిన - తన మనస్సు మెచ్చిన యువకుడ్ని ఎన్నుకొని పెళ్ళి చేసుకుంటా నన టంలో తప్పు లేదు. కాని, ఒక తండ్రిగా తన కూతురు కోరినవాడితో పెళ్ళి చేయకుండా, తన బావమరదినే పెళ్ళాడాలని కండిషన్ పెట్టిన పద్మ తండ్రి రంగారావు తండ్రేనా?....ఏ తండ్రయినా, తల్లయినా కోరుకొనేది తమ బిడ్డలు సుఖజీవితం గడపాలనే! నూరేళ్లూ నిండైన సంసారం చేయాలనే! కాని, పెళ్ళి చేసే దగ్గరే యిన్ని ఆంక్షలు పెడితే....తమ బిడ్డల సుఖజీవనానికి వాళ్లు పునాది వేసినట్టేనా?....కాదు వాస్తవంగా చూస్తే అది సుఖ జీవితానికి సమాధి చెయ్యడమేనని ఎవరైనా చెప్తారు.

అందుకే పద్మ మనస్సు వికలమైపోయింది. ఏదో యాంత్రికంగా పనులు చేస్తోందే తప్ప.... తండ్రి చెప్పిన మాటలు ఆమె ఎదలోయల్లోనుంచి లావాలా ఉప్పొంగి తన తన హృదయాన్ని కంపింపచేసేస్తున్నట్టుం దామెకు.

''తనింట్లో ఒప్పుకోవటం లేదని .... హేమంత్ కెలా చెప్పాలి? హేమంత్ కెలాగో నచ్చజెప్పినా ఈ పెళ్ళి తన కిష్టంలేదు ... తనకి హేమంతే కావాలి....అతను తప్ప యింకెవర్నీ తను పెళ్ళిచేసోకోడు.'' ...స్వగతంలో ఎన్నో ఆలోచనలు.

ఇదే సమయంలో హేమంత్ యింటికి వెళ్తున్నాడు. పద్మని జూపార్కుదగ్గర డ్రాప్‌చేసి, బజారెళ్ళివస్తున్నాడు.

చుట్టూ చీకటి వ్యాపించి వుంది, మెర్కురీ దీపాల కాంతిలో సైకిలు తొక్కుకుంటూ పోతున్నాడు హేమంత్.

''పద్మ యింటికెళ్ళి తన తల్లిదండ్రులనడుగుతుంది.... వాళ్ళ ఫాదర్ ఒప్పుకుంటారు. హాయిగా యిద్దరం పెళ్ళి చేసేసుకోవచ్చు. ఎంతో ఆనందంగా .. అహ్లాదంగా సాగుతుంది జీవితం....నిరంతరం పద్మ ప్రక్కనవుంటే ఎంతో హాయిగా వుండొచ్చు. తను త్వరగా పోయి ఫాదర్ని అడగాలి.'' పరిపరి విధముల ఆలోచించుకుంటూ చల్లటిగాలిలో రివ్వున సైకిలును తొక్కుకుపోతున్నాడు హేమంత్.

ఇల్లు దగ్గరపడింది. సైకిలు షెడ్‌లో పెట్టి, యింట్లో అడుగుపెడ్తూ హేమంత్, ''మమ్మీ....డాడీ వచ్చారా?'' అడిగాడు.

భారతీలక్ష్మి హేమంత్‌వేపు ఆశ్చర్యంగా చూస్తూ.... 'ఏమిట్రా హేమంత్, ఎప్పుడూ డాడీ అంటే భయపడి బయటికెళ్ళిపోయేవాడివి....ఈరోజు యింత కట్టిగా పిలుస్తున్నావ్'' అడిగింది.

''అది కాదు మమ్మీ....ఏం లేదు ... నథింగ్ ...సారీ'' అన్నాడు తడబడుతూ.

''ఏంట్రా చెప్పు....నాదగ్గరేం భయం.''

''కాదు మమ్మీ....ఈ సం॥తో నాది బియ్యేస్సీ అయిపోతుంది కదా!''

''అయిపోతే?'' ప్రశ్నార్థకంగా చూసింది భారతీలక్ష్మి.

''మవింటికోసారొచ్చింది చూడు ఒకమ్మాయి....పేరు పద్మ....నా క్లాస్ మేట్.''

''అవును....''

"అమెను .. నేను....ప్రేమిస్తున్నాను."

"ఏమిటీ.... వియస్సీ పూర్తవనే లేదు....పెళ్ళినూ....ప్రేమానూ....నాకేం తెలీదు .. మీ నాన్నగార్నడుగు" అని భారతీలక్ష్మి వంటింట్లోకి వెళ్ళిపోయింది.

"ఏమిటే.... నన్నడగమంటున్నావ్" అంటూ రామనాథం యింట్లో అడుగుపెట్టాడు.

భారతీలక్ష్మి దగ్గర్లో లేకపోయేసరికి ఎదురుగా వున్న హేమంత్‌ను చూసి, "ఏమిట్రా, నన్నడగవల్సింది...." అడిగాడు రామనాథం.

"ఏంలేదు డాడీ....ఊరికినే" నసిగాడు హేమంత్.

"నువ్వు, నన్నేం అడగదల్చుకున్నావో నాకు బాగా తెల్సు. నీ క్లాస్‌మేట్ దాన్నో, ఎవతెనో ప్రేమిస్తున్నావు.... దానితో నీకు పెళ్ళిచెయ్యమంటావ్.... అంతేనా?" గట్టిగా అడిగాడు, తీక్షణమైన స్వరంతో.

అది నిజమన్నట్లు తలూపాడు హేమంత్ "అవును.... డాడీ" అని చెప్తూ.

"నోర్మూయ్....సిగ్గులేదటరా . ఆ అమ్మాయితో అంత మంది మధ్య బీచ్‌లో .. దాని ఒడిలో తలపెట్టి మాట్లాడటానికి. మగవాడివి, నీకు సిగ్గు లేకపోయినా.... ఆడదై పుట్టిన దానికూ్కడా సిగ్గులేదట్రా....రాస్కెల్....అలాంటి దాన్ని మాకు కోడలుగా తెచ్చుకోమంటావ్? అంతేనా?" గద్గద స్వరంతో గద్దించాడు రామనాథం.

భారతీలక్ష్మి యివన్నీ వింటున్నా ఏం మాట్లాడలేకపోయింది.



TEL: "TITONI" Phone: 23467
TITONI KNITTING CO., TIRUPUR—638 602.

హేమంత్ ఎన్నడూలేని ధైర్యం తెచ్చుకొని "డాడీ! "డాడీ.... మీరు చెప్పినట్లు బీచ్‌లో మేం మాట్లాడుకోవటం తప్పే కావచ్చు. కాని, సిగ్గు లేదనీ... అది లేదనీ ...ఇది లేదనీ మీరు ఆ అమ్మాయిని మాత్రం కించపరచ వద్దు! ప్రేమికులకు భయం, పిరికితనం, సిగ్గు ఉండవు....ఉండకూడదు. ప్రేమకి హద్దులు కూడా లేవు. మీ కిష్టమైతే మమ్మల్ని ఆశీర్వదించి, ఆనంద పరచండి. లేకపోతే.... నేనే ఏదో మార్గం చూసుకుంటాను!" అన్నాడు.

"ఏమిరా.... నువ్వు చూస్కునేది? నీకు సిగ్గూ, లజ్జా ఏమైనా వుంటే....మా మీద ఆధార పడకుండా, నీ బ్రతుకు నువ్వు చూసుకో! దాని కభ్యంతరం లేదు." అన్నారు, రామనాథం ఆవేశంగా.

భారతలక్ష్మి ప్రేక్షకురాలయి పోయిందే తప్ప, ఏం మాట్లాడలేక పోయింది.

తన బేగ్‌ను సర్దుకొని, అప్పుడే యిల్లు విడిచి బయటకు దారి తీశాడు హేమంత్.

* * *

బీచ్‌లో కూర్చొని ఆలోచిస్తున్నాడు హేమంత్. "పద్మ ఎందుకు రాలేదు? అసలు పద్మ కీ సంగతెలా చెప్పాలి? ఇప్పుడు వుద్యోగమేమీ లేదు. చదువు పూర్తవ లేదు.... ఎలా?" పరి-పరి విధములైన ఆలోచనలతో సతమతమవుతున్నాడు హేమంత్.

దూరం నుంచి ఓ స్త్రీ రూపం కనిపిస్తోంది. హేమంత్ అటు వేపే చూస్తున్నాడు.

ఆమె నడకను బట్టి అంచనా వేశాడు హేమంత్, ఖచ్చితంగా ఆమె పద్మేనని.

కాని, ఆమె ముఖంలో ఏదో విచారం కొట్టవచ్చినట్లు కనిపిస్తోంది. ఏదో ఆవేదన కదలాడుతోంది. ఎప్పుడూ నవ్వులొలికే ఆమెలో ఈ రోజు ఏదో విలాపమో....విచారమో అగుపిస్తోంది...."

"పద్మా! ఎందుకు విచారంగా ఉన్నావ్?...." దగ్గరి కొస్తున్న పద్మని ఆతృతగా అడిగాడు హేమంత్.

పద్మ, ఏం మాట్లాడకుండా - హేమంత్ ఒడిలో పడి పోయి "హేమంత్! నేనంటే నీకెంతో ప్రేమ కదూ? నువ్వంటే నాకూ ప్రేమే....అందుకే నీ తియ్యని పెదవులతో నాకొక్క ముద్దెట్టవూ?" అడిగింది, అలాపనగా.

హేమంత్‌కు ఆమె మాట్లాడుతున్న తీరు భయంగా తోచింది. ఆమె కోరికను తీర్చాడు.

"పద్మా! ఏమిటి? మీ నాన్నగారు మన పెళ్ళి కొప్పుకున్నారా? నీ ప్రవర్తనలో ఏదో మార్పు కనిపిస్తోంది.... చెప్పు పద్మా...." ఆందోళనగా అడిగాడు హేమంత్.

పద్మ, "హేమంత్! మన పెళ్ళి జరగదు....నా పెళ్ళి అసలు జరగదు, ఎవరితో కూడా....మా నాన్నగారు మన పెళ్ళి కొప్పుకోలేదు. ఇంకో పెళ్ళి నిశ్చయించారు. నా కదృష్టం లేదు. అందుకే విషం తీసుకొచ్చాను. ఇంకెంతో కాలం బ్రతకలేను. నన్ను క్షమించు హేమంత్....నన్ను క్షమించు!...." అవి యింకేం మాట్లాడలేక పోయింది. నోటంబడి మాట రాలేదు. ప్రాణాలే వదిలింది.

హేమంత్ కేం తోచటం లేదు. అంతా ఏదో వింతగా, భయంగా అగుపిస్తోంది. మనస్సు ఆందోళన చెందుతోంది. హృదయపు లోయల నుంచి ఏదో ఆవేదన, ఆరాధన, ఆందోళన పుట్టుకొచ్చింది. "పద్మా! ఎంత పని చేశావ్?" అని ఒక్క అరుపు అరిచాడు. అంతే!

అతనికంతా అగమ్యగోచరంగా వుంది. ప్రపంచమంతా చీకటయిపోయింది. సముద్రపు కెరటాలు తమ చిలిపి తీపి గురుతులను, తనలో కలిపేసుకున్నట్లనిపించింది. రోజూ తమ కాహ్లాదం చేకూర్చే చల్లని గాలి, సుడిగాలై తన ప్రియురాల్ని చంపేసి నట్లనిపిస్తోంది. అంతే! తెలివి గమ్యంతో, తీరని ఆవేదనతో, గుర్తు తెలియని ఆలోచనలతో అడుగులు వేస్తూ సముద్రంలోకి దూసుకు పోయాడు.

—కెరటం తనని బలి తీసుకుంటుందనే భయం లేదు.

—చేపలు మింగేస్తాయనే క్షోభ లేదు.

—ప్రాణం పోతుందనే భీతి లేదు.

ఒకే ఒక్క కెరటం వచ్చి, ప్రాణంతో యున్న హేమంత్‌ను సగౌరవంగా లోపలికి ఆహ్వానించి, ప్రాణాన్ని తనకి బహుమతిగా పుచ్చుకొని, శవాన్ని ఒడ్డుకు కొట్టేసింది....

ఎన్నో తీపి గురుతులతో జీవితం గడిపిన ...ఎన్నో తీయని ఆశలతో తన్మయత్వం చెందిన....ఎన్నో మధురమైన కలలతో మైమరచిపోయిన ఆ ప్రేమపక్షులు రెక్కలు నరకబడి క్రిందనే రాలి పడ్డాయి.

కాకుల ప్రపంచంలో - పలు గాకుల క్రూరత్వానికి.... ఇద్దరు తండ్రుల అమానుషత్వానికి బలియిపోయారు వాళ్ళిద్దరూ!

ఇది చూడలేనని తన తప్పు తెలుసుకున్న కెరటం ప్రశాంతమయింది. క్రమంగా చుట్టూ చీకట్లు వ్యాపిస్తున్నాయ్. ఆ చంద్రుడు మాత్రం తన వెన్నెల వెలుగును ఆ ప్రేమజంట పైనే ప్రసరిస్తున్నాడు.